నీళ్లు లేక స్కూళ్లు మూత!

కర్ణాటకలో నీటి కొరత మరింత తీవ్రం

- ప్రైవేటు నీటి ట్యాంకర్ల రేట్లు డబుల్
- కాంగ్రెస్ పాలనలో ప్రజల అష్టకష్టాలు
- వారంలో సమస్య పరిష్కరించాలి
- లేదంటే ఆందోళనకు దిగుతామని విపక్షం హెచ్చరిక

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో బెంగళూరులోని ఓ బస్తీవాసుల ధర్నా (ఫైల్)

బెంగళూరు, మార్చి 7: కర్ణాటకలో నీటి కటకట రోజురోజుకూ తీవ్రమవుతున్నది. రాజధాని బెంగళూరులో నీళ్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. స్కూళ్లలో విద్యార్థులకు తాగడానికి కూడా నీరు దొరకని దుస్థితి ఏర్పడింది. నీటి కొరత వల్ల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలలు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బెంగళూరు గొంతెండుతున్నది. నగరంలో రోజుకు 2,600 నుంచి 2,800 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉంటే ఇప్పుడు దాదాపుగా 1,300 ఎంఎల్‌డీ నీ రు మాత్రమే సరఫరా అవుతున్నది. అంటే, అవసరమైన నీటిలో సగం కూడా సరఫరా జరగడం లేదు. మరోవైపు వేసవి ఇంకా పూర్తిగా ప్రారంభం కాకముందే భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు ఎండిపోతున్నాయి.

ప్రైవేటు ట్యాంకర్లే దిక్కు

ఒకవైపు జలమండలి నుంచి నీటి సరఫరా సగానికి సగం తగ్గిపోవడం, మరోవైపు బోర్లు పని చేయకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. డిమాండ్ ఎక్కువవడంతో ట్యాంకర్ల ధరలు అమాంతం పెంచేశారు. ప్రజల అవసరాన్ని బట్టి డబ్బులు వ సూలు చేస్తున్నారు. ఇంతకుముందు 6,000 లీటర్ల ట్యాంకరుకు రూ.600 ధర ఉంటే ఇ ప్పుడు రూ.1,500కు చేరింది. అది కూడా బుక్ చేసుకున్న 3-4 రోజులకు సరఫరా అవుతున్నది. వెంటనే సరఫరా చేయాలంటే ఒక్కో ట్యాంకర్‌కు 2,000 సమర్పించుకోవాల్సి వస్తున్నది.

7 వేల గ్రామాల్లో నీటి కొరత ?

బెంగళూరుతో పాటు కర్ణాటకలోని వందలాది గ్రామాల్లో తాగునీటికి ఇప్పటికీ తీవ్ర కొరత ఉంది. వేసవి తీవ్రం అవుతున్నా కొద్ది మరింత నీటి కటకట తప్పదని, దాదాపు 7,000 గ్రామాల్లో తాగు నీటి కొరత రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు తాగునీరు కూడా అందడం లేదు. తిన్న తర్వాత చేతులు కడిగేందుకు కూడా నీళ్లు దొరకడం లేదు. దీంతో అనివార్యంగా సెలవులు ఇస్తున్నారు. కొన్ని విద్యా సంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి. నీటి కొరత గురించి నిపుణు లు ముందే హెచ్చరించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అశ్రద్ధ చేయడంతోనే ఈ పరిస్థితి వ చ్చిందని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఆరోపించారు. వారం రోజుల్లో నీటి కొరతను నివారించాలని ఆయన అల్టిమేటం జారీచేశారు.

విద్యార్థులే ఆన్సర్ షీట్లు తెచ్చుకోవాలి!

కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఉత్తర్వులు..సిద్ధరామయ్య ప్రభుత్వంపై బీజేపీ ఫైర్

న్యూఢిల్లీ, మార్చి 7: తన అస్తవ్యస్త విధానాలతో కర్ణాటక రాష్ట్రాన్ని దివాలా దిశగా తీసుకెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మరో గందరగోళ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇక నుంచి పరీక్షలు రాసే విద్యార్థులు జవాబు పత్రాలను తామే తెచ్చుకోవాలంటూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర సిలబస్‌ను బోధించే అన్ని పాఠశాలల్లో నిర్వహించే పరీక్షలకు ప్రభుత్వం ప్రశ్న పత్రాలు మాత్రమే ఇస్తుందని, జవాబు రాసే పత్రాలను విద్యార్థులే తెచ్చుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆన్సర్ షీట్లను ముద్రించేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేకే ఈ నిర్ణయం తీసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

కొనసాగే అర్హత కాంగ్రెస్‌కు లేదు..

పరీక్షల జవాబు పత్రాలను సైతం విద్యార్థులనే తెచ్చుకోమంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ దివాలకోరు వైఖరిపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తీవ్రంగా ధ్వజమెత్తారు. పూర్తి గందరగోళంలో ఉన్న సిద్ధరామయ్య ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హతను కోల్పోయిందని ఆయన అన్నారు. ఆన్సర్ బుక్‌లెట్ల ప్రింటింగ్ కోసం వెంటనే విద్యాశాఖకు నిధులను అందజేయాలని సీఎంను కోరారు. ఒక ప్రణాళిక, ముందుచూపు లేని ప్రభుత్వం విద్యార్థి లోకాన్ని తీవ్ర ఒత్తిడిలోకి నెడుతున్నదని ఆయన ఆరోపించారు.

ప్రొఫెసర్ సాయిబాబా విడుదల

భార్యతో కలిసి సాయిబాబా చిరునవ్వులు

నాగపూర్, మార్చి 7: మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణల కేసులో శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా గురువారం నాగ్‌పూర్ కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. మంగళవారం బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచి ఇచ్చిన తీర్పు మేరకు జైలు నుంచి బయటకు వచ్చారు. కాగా, 90 శాతం వైకల్యంతో వీల్‌చైర్‌కే పరిమితమైన సాయిబాబా మావోయిస్టులతో సంబంధాలు పెట్టుకుని దేశద్రోహానికి పాల్పడ్డారన్న ఆరోపణపై ఆయనతో పాటు మరో ఐదుగురికి మహారాష్ట్ర, గడ్చిరోలి ట్రయిల్ కోర్టు జీవిత ఖైదు విధించడంతో 2017 నుంచి నాగ్‌పూర్ జైలులోనే ఉన్నారు. అంతకుముందు కూడా ఆయన 2014 నుంచి 2016 వరకు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలయ్యారు.

పోరాడినందుకే టార్గెట్ చేశారు

దేశంలోని మధ్య, ఈశాన్య ప్రాంతాల్లో ఆదివాసీల హక్కుల కోసం పోరాడినందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని సాయిబాబా ఆరోపించారు. తనకు ఆరోగ్యం బాగా లేదని, మాట్లాడలేనని తొలుత పేర్కొన్నప్పటికీ న్యాయవాదులు, మీడియా వారి వినతి మేరకు మాట్లాడారు. కఠినమైన జైలు జీవితం గడిపిన తర్వాత తానిలా బయటపడటం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. తనపై అక్రమ కేసు బనాయించారన్నారు. తాను, తన మిత్రులు అనుభవించిన 10 ఏండ్ల జైలు జీవితాన్ని ఎవరు వెనక్కి తెస్తారని ఆయన ప్రశ్నించారు.

వితంతువుల పెండ్లికి రూ.2 లక్షలు

జార్ఖండ్‌లో కొత్త పథకం

రాంచి, మార్చి 7: వితంతువుల కోసం జార్ఖండ్ ప్రభుత్వం విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టింది. 'విధ్వ పునర్వివాహ్ ప్రోత్సాహన్ యోజన' పేరుతో కొత్త పథకాన్ని జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపయీ సోరేన్ ప్రారంభించారు. వితంతువులు మళ్లీ వివాహం చేసుకుంటే ఈ పథకం కింద రూ.2 లక్షల ప్రోత్సాహం ఇవ్వనున్నది. దేశంలోనే ఇలాంటి పథకం మొదటిసారి తామే తీసుకువస్తున్నామని సీఎం చంపయీ పేర్కొన్నారు. వితంతువుల జీవితాలు ఆగిపోవద్దని, మళ్లీ పెండ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించాలనే ఆలోచనతో ఈ పథకాన్ని ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయ పన్ను కట్టే వారికి ఈ పథకం వర్తించదు.



యూరప్‌ను వణికిస్తున్న ప్యారట్ ఫీవర్

వ్యాధితో ఐదుగురు మృతి

లండన్, మార్చి 7: ప్యారట్ ఫీవర్‌తో యూరప్ దేశాలు వణుకుతున్నాయి. ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్‌లో ఈ కేసులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధితో ఇప్పటి వరకు ఐదుగురు మృతి చెందారు. ఇన్ఫెక్షన్‌కు గురైన పక్షుల ద్వారా మనుషులకు సోకే ఈ వ్యాధి శ్వాసకోశ వ్యాధులు, జ్వరం, తీవ్ర తలనొప్పి, పొడి దగ్గు, కండరాల నొప్పులకు కారణం అవుతున్నది. క్లామిడోఫిలా సిటాసి అనే బ్యాక్టీరియా సోకటం వల్ల ఈ వ్యాధి వస్తుంది. పౌల్ట్రీ, వెటర్నరీ విభాగాల్లో పనిచేసేవారికి, పక్షులను పెంచుకొనేవారు ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నట్టు వెల్లడిస్తున్నారు. బ్యాక్టీరియా సోకిన 5-14 రోజుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని తెలిపింది.

నాటో 32వ సభ్య దేశంగా స్వీడన్

దశాబ్దాల తటస్థతకు ముగింపు

స్వీడన్ ప్రధాని క్రిస్టర్సన్‌కు నాటో న్యాయ నిబంధనావళిని అందిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్

వాషింగ్టన్, మార్చి 7: నాటో కూటమిలో 32వ సభ్యదేశంగా స్వీడన్ గురువారం అధికారికంగా చేరింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగడంతో దశాబ్దాల తటస్థ వైఖరికి ముగింపు పలుకుతూ స్వీడన్ నాటోలో చేరింది. స్వీడన్ చేరిక వల్ల యునైటెడ్ స్టేట్స్, మిత్ర దేశాలు మరింత సురక్షితమయ్యాయని వైట్‌హౌస్ పేర్కొన్నది. గతేడాది నాటో కూటమిలో ఫిన్లాండ్ చేరిక తర్వాత ఇప్పుడు స్వీడన్ చేరింది. గత కొన్నేళ్లుగా నాటో సభ్య దేశాలైన టర్కీ, హంగేరిలు అభ్యంతరం తెలుపటంతో స్వీడన్ సభ్యత్వం నిలిపివేశారు. తీవ్రవాదులుగా పరిగణించే కుర్దిష్ గ్రూపులకు స్వీడన్ ఆశ్రయం కల్పిస్తున్నదని టర్కీ ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చింది. మరోవైపు హంగేరి అధ్యక్షుడు విక్టర్ ఓర్బన్ ఇప్పటి దాకా రష్యా అనుకూల భావాన్ని ప్రదర్శిస్తూ.. ఉక్రెయిన్‌కు మద్దతునివ్వాలన్న కూటమి సంకల్పానికి విరుద్ధంగా వ్యవహరించాడు. కొన్ని నెలల వ్యత్యాసంతో అటు టర్కీ, ఇటు హంగేరి రెండూ నాటో కూటమిలో స్వీడన్ ప్రవేశానికి ఆమోదం తెలిపాయి. ఈ సందర్భంగా స్వీడన్ ప్రధాని మాట్లాడుతూ.. ఇది చారిత్రక దినమని, స్వేచ్ఛకు లభించిన విజయమని పేర్కొన్నారు.

వయనాడ్ నుంచే రాహుల్ పోటీ!

40 మంది అభ్యర్థుల పేర్లు ఖరారు

న్యూఢిల్లీ, మార్చి 7: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు పోటీ చేయనున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక, ఇతర విషయాలు చర్చించడానికి గురువారం పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తొలిసారిగా సమావేశమైంది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ సహా 40 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. త్వరలోనే లిస్టును విడుదల చేస్తామని చెప్పారు. ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 11 రాష్ట్రాలకు చెందిన 60 మంది లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల అభ్యర్థుల గురించి చర్చ జరిగింది.

రేషన్ కార్డు అడ్రస్ ప్రూఫ్ కాదు

ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: రేషన్ కార్డును అడ్రస్ ప్రూఫ్‌గా పరిగణించరాదం టూ ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. రే షన్ కార్డు ప్రజా పంపిణీ వ్యవస్థ కింద లభించే సరుకులను తీసుకోవడానికి ఉద్దేశించింది మాత్రమేనని, దానిని చిరునామా, ఇంటి ధ్రువీకరణ పత్రంగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు గురువారం పేర్కొంది. కత్‌పుట్లీ కాలనీ వాసుల పునరావాసం సందర్భంగా ఆ పథకం కింద లబ్ధి పొందడానికి పూర్వం అక్కడ నివసించినట్టు అడ్రస్ ప్రూఫ్‌గా రేషన్‌కార్డును సమర్పించాలంటూ అధికారులు వి ధించిన నిబంధనను సవాల్ చేస్తూ కొందరు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

జెలెన్‌స్కీ, గ్రీక్ ప్రధాని లక్ష్యంగా క్షిపణి దాడి

తృటిలో తప్పించుకున్న నేతలు

కీవ్, మార్చి 7: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, గ్రీక్ ప్రధాని కిరియాకోస్ మిత్సటాకోస్‌లిద్దరూ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వారి కాన్వాయ్ లక్ష్యంగా రష్యా ప్రయోగించిన క్షిపణి కేవలం 500 మీటర్ల దూరంలో పడింది. నల్లసముద్రం తీరంలోని ఒడెస్సా నగరంలో ఈ సంఘటన చోటు చేసుకున్నది. గ్రీక్ ప్రధాని కిరియాకోస్ ఉక్రెయిన్ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా జెలెన్‌స్కీతో కలిసి నగరం చూడటానికి బయల్దేరారు. ఈ సమయంలోనే క్షిపణి దాడి జరిగింది. ఈ దాడిలో ఐదుగురు మరణించారు. పలువురికి గాయాలయ్యాయి.

జూలై 7న సీటెట్

న్యూఢిల్లీ, మార్చి 7: దేశవ్యాప్తంగా సీబీఎస్‌ఈ నిర్వహించే కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'సీటెట్' జూలై 2024 నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. 19వ ఎడిషన్ సీటెట్ పరీక్షను 2024 జూలై 7న (ఆదివారం) నిర్వహించనున్నట్టు సీబీఎస్‌ఈ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 136 నగరాల్లో 20 భాషల్లో నిర్వహించే ఈ పరీక్షకు మార్చి 7 నుంచి ఏప్రిల్ 2 రాత్రి 11.59 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. సీటెట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు.

జేఈఈ మెయిన్స్ పేపర్-2 ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: జేఈఈ 2024 మెయిన్స్ పేపర్ 2 ఫలితాల్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గురువారం విడుదల చేసింది. పరీక్ష ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చామని ఎన్‌టీఏ తెలిపింది. దేశవ్యాప్తంగా బీఆర్క్, బీప్లాన్ కోర్సుల్లో ప్రవేశాన్ని కల్పించే పేపర్-2 పరీక్షకు సంబంధించి ఆల్ ఇండియా ర్యాంక్, స్కోర్ శాతాన్ని తెలిపే కార్డులను తాజా ఫలితాల్లో విడుదల చేసింది.

వృద్ధుడితో నిప్పులపై నాట్యం

చేతబడి నెపంతో దారుణం

థాణే: చేతబడి చేస్తున్నాడ నే నెపంతో 75 ఏండ్ల వృద్ధుడిని కొం దరు నిప్పులపై నాట్యం చేయించిన అమానుష ఘటన ఈ నెల 4న మ హారాష్ట్రలోని థాణే జిల్లాలో జరిగిం ది. గురువారం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ముర్‌డ్ తాలుకా కెర్వెలె గ్రామంలో గుడి వద్ద మత కార్యక్రమం జరుగుతున్నప్పుడు 15-20 మంది గ్రామస్థులు వృద్ధుడి ఇంట్లోకి ప్రవేశించి అతడిని గుడి వద్దకు లాక్కొచ్చారు. చేతబడి చేస్తున్నాడని ఆరోపించి కొందరు అతడిపై దాడి చేశారు. బలవంతంగా అతడితో నిప్పులపై నాట్యం చేయించారు.

పదోన్నతులు ఇంకెప్పుడు?

మోదీ సర్కారుపై కేంద్ర ఉద్యోగుల ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 7: పదోన్నతులు కల్పించటంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సీసీఎస్) అధికారులు గురువారం పెద్ద ఎత్తున నిరసన తెలియచేశారు. ఢిల్లీలోని శాస్త్రి భవన్ బయట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సుమారు 2500 మంది అధికారులు పాల్గొన్నారని సీసీఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఉదిత్ ఆర్య తెలిపారు. తమ డిమాండ్ నెరవేరకపోతే మార్చి 11న సుమారు 5వేల మందితో నిర్మాణ్ భవన్ ఆవరణలో మరోసారి నిరసనకు దిగుతామని వెల్లడించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో పెరుగుతున్న మానవ వనరుల డిమాండ్‌ను అంచనా వేయటానికి కేంద్ర ప్రభుత్వం 2022లో ఉన్నత స్థాయి క్యాడర్ రివ్యూ కమిటీ (సీఆర్‌సీ)ని ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటి వరకు సీఆర్‌సీ నివేదిక సమర్పించలేదని ఆర్య తెలిపారు. సీఆర్‌సీ వెంటనే నివేదిక సమర్పించాలని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు ఉదిత్ ఆర్య పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో జోక్యం చేసుకుంటారని తాము భావిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం మేల్కొనకపోతే తమ ఉద్యమం ఉధృతం చేస్తామని, చివరకు సహాయ నిరాకరణ వరకు వెళతామని ఆర్య హెచ్చరించారు.

4 శాతం డీఏ పెంపు

- ఉద్యోగులకు కేంద్రం శుభవార్త
- మరో ఏడాది 'ఉజ్వల' రాయితీ
- రూ.10,372 కోట్లతో ఏఐ మిషన్
- ముడి జనపనార ఎంఎస్పీ పెంపు
- ఎన్నికల వేళ కీలక నిర్ణయాలు

క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, మార్చి 7: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల డీఏ(కరవు భత్యం)ను, పెన్షనర్ల డీఆర్‌ను 4 శాతం పెంచింది. దీంతో ఇప్పటివరకు జీతం/పింఛన్‌లో 46 శాతంగా ఉన్న డీఏ/డీఆర్ ఇప్పుడు 50 శాతానికి చేరుకుంది. ఈ ఏడాది జనవరి 1 నుంచే ఈ నిర్ణయం అమలులోకి రానుంది. పెరిగిన ధరల దృష్ట్యా డీఏ/డీఆర్ పెంచాలని తాజా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్టు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. డీఏ పెంపు వల్ల 49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, డీఆర్ పెంపుతో 67.95 లక్షల మంది పెన్షనర్లకు లాభం చేకూరనుంది. కేంద్రంపై ఏడాదికి రూ.12,869 కోట్ల భారం పడనుంది. 2024- 25(2024 జనవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు)లో రూ.15,014 కోట్ల భారం పడుతుంది. 7వ సెంట్రల్ పే కమిషన్ సిఫార్సుల ఆధారంగా కేంద్రం డీఏ పెంపు నిర్ణయం తీసుకున్నది.

ఉజ్వల సిలిండర్లపై సబ్సిడీ పొడిగింపు

ప్రధానమంత్రి ఉజ్వల యోజన(పీఎంయూవై) ద్వారా గ్యాస్ కనెక్షన్లు పొందిన మహిళలకు కూడా కేంద్రం శుభవార్త చెప్పింది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న రూ.300 సబ్సిడీని వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా కొనసాగించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఏడాదికి 12 సిలిండర్లకు ఈ సబ్సిడీ వర్తిస్తుంది. గత ఏడాది అక్టోబరు వరకు రూ.200 సబ్సిడీ ఇచ్చిన కేంద్రం తర్వాత రూ.300కు పెంచింది. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 10 కోట్ల మందికి లబ్ధి కలగనుండగా ప్రభుత్వంపై ఏడాదికి రూ.12,000 కోట్ల భారం పడుతుంది.

ముడి జనపనార మద్దతు ధర పెంపు

2024 - 25 సీజన్‌కు గానూ ముడి జనపనార కనీస మద్దతు ధరను రూ.285 పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ముడి జనపనార కనీస మద్దతు ధర రూ.5,335కు చేరుకుంది.

ఈశాన్య రాష్ట్రాల 'ఉన్నతి' కోసం..

ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామిక అభివృద్ధి కోసం కేంద్రం 'ఉన్నతి' పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. రూ.10,037 కోట్లు కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. గోవా అసెంబ్లీలో షెడ్యూల్డ్ తెగలకు(ఎస్టీ) రిజర్వేషన్లు కల్పించే బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

10 వేల కోట్లతో ఏఐ మిషన్

ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ(ఏఐ)కి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.10,372 కోట్లతో ఏఐ మిషన్ ప్రారంభించాలని నిర్ణయించింది. ఐదేండ్ల పాటు ఏఐ మిషన్ కార్యక్రమం కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నది. ఈ నిధులతో ప్రభుత్వం 10 వేల జీపీయూ సామర్థ్యంతో కూడిన సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఏఐ ఆవిష్కరణల కోసం పని చేసే స్టార్టప్‌లు, ఔత్సాహికులు, పరిశోధకులకు అందుబాటులోకి తీసుకురానున్నది.

టీఎంసీ మహిళా విభాగం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మమతా బెనర్జీ

మహిళలకు బెంగాల్ సురక్షితం

- ప్రధాని మోదీకి దీదీ కౌంటర్
- కోల్‌కతాలో మహిళలతో ర్యాలీ

కోల్‌కతా: సందేశ్‌ఖాలీ హింసను దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కామెంట్‌కు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దీటుగా స్పందించారు. ప్రధాని ఆరోపించినట్టు కాకుండా మహిళలకు బెంగాల్ ఎంతో సురక్షితమని దీదీ పేర్కొన్నారు. కోల్‌కతాలో మహిళా మద్దతుదారులతో ఆమె గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. సందేశ్‌ఖాలీ గురించి బీజేపీ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నదని ఆమె ఆరోపించారు. బెంగాల్‌లో మహిళల భద్రత గురించి దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ వాళ్లు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న హింసపై ఎందుకు మౌనం దాలుస్తున్నారని మమత ప్రశ్నించారు.

బీజేపీలో చేరిన హైకోర్టు మాజీ జడ్జి

కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ గురువారం బీజేపీలో చేరారు. బీజేపీలో జడ్జి చేరికపై తృణమూల్ విమర్శలు గుప్పించింది.

కేజ్రీవాల్‌కు కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, మార్చి 7: మద్యం పాలసీ కేసులో తాము జారీ చేసిన సమన్లకు స్పందించడం లేదని ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీచేసింది. ఈ నెల 16న తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. నాలుగు నుంచి ఎనిమిదో సమన్ల వరకు ఈడీ ఈ ఫిర్యాదు చేసింది. తొలి మూడు సమన్లకు సంబంధించి ఈడీ ఇదివరకే కోర్టులో ఫిర్యాదు చేసింది. మొత్తంగా ఇప్పటివరకు కేజ్రీవాల్‌కు ఈడీ ఎనిమిది సార్లు సమన్లు పంపింది. అవి చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఆయన విచారణకు హాజరుకావడం లేదు.

సలాం.. డాక్టర్ భాయ్!

- *ప్రపంచంలోనే అతి పొట్టి వైద్యుడు గణేశ్*
- *అరుదైన వ్యాధితో 23 ఏండ్ల వయసొచ్చినా 3 అడుగులు దాటని ఎత్తు, 18 కిలోల బరువు*
- *దీంతో నీట్‌లో క్వాలిఫై అయినా సీటు నిరాకరణ*
- *హైకోర్టులో చుక్కెదురు.. చివరకు సుప్రీంలో గెలుపు*
- *పట్టుదలతో కల సాకారం.. డాక్టర్‌గా రోగులకు సేవ*

విధుల్లో భాగంగా రోగి గుండె చప్పుడు పరిశీలిస్తున్న డాక్టర్ గణేశ్ బారాయ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గణేశ్ బారాయ. ఊరు గుజరాత్‌లోని గోరఖి అనే కుగ్రామం. ప్రపంచంలోనే అత్యంత పొట్టి డాక్టర్‌గా గణేశ్ రికార్డు సృష్టించాడు. ప్రతీ విజయం వెనుక ఎన్నో ఆటుపోట్లు ఉంటాయన్నట్టు.. డాక్టర్ కావాలన్న కలను చేరుకోవడానికి గణేశ్ కూడా ఎన్నో అవాంతరాలను దాటాల్సి వచ్చింది. తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏకంగా సుప్రీంకోర్టు గడపతొక్కాడంటే లక్ష్యసాధనలో అతని చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

ఆ మాటలు మనసులోకి..

గణేశ్‌కి ఏడుగురు తోబుట్టువులు. తండ్రి రైతు. కుటుంబ సంపాదన అంతంతే. దీంతో గణేశ్ మినహా మిగిలినవారంతా పాఠశాల స్థాయిలోనే చదువు ఆపేశారు. అయితే, 'మనిషి జీవితానికి సార్థకత.. తోటి మనిషికి ప్రాణంపోయడమే' అని తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు స్కూల్‌లో టీచర్ చెప్పిన మాటలు గణేశ్ మనసులో బలంగా నాటుకుపోయాయి. దీంతో పెద్దయ్యాక కచ్చితంగా డాక్టర్ అయ్యి నలుగురికి ప్రాణదాతగా మారాలని నిర్ణయించుకొన్నాడు. 'తానొకటి తలిస్తే, దైవం మరొకటి తలిచింద'న్నట్టు పుట్టుకతోనే లోకోమోటివ్ సమస్యను ఎదుర్కొంటున్న గణేశ్‌కు వయసు పెరిగిన కొద్దీ ఆ వ్యాధి పెరుగడం ప్రారంభించింది. దీంతో 23 ఏండ్ల వయసొచ్చినా.. అతని ఎత్తు 3 అడుగులు, బరువు 18 కిలోలు మాత్రమే ఉండేది.

తొలుత చుక్కెదురైనా..

*స్కూల్, కాలేజీలో గురువులు, తోటి విద్యార్థుల సహకారం ఉండటంతో తన పరిస్థితి గురించి గణేశ్ ఎప్పుడూ బాధపడలేదు. చక్కగా చదువుకొని ఇంటర్‌లో 87 శాతం మార్కులు, 2018లో రాసిన నీట్ పరీక్షలో 233 మార్కులను గణేశ్ సాధించి డాక్టర్ కావాలన్న తన కలను సాధించుకోవడానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ కోసం కౌన్సిలింగ్‌కు హాజరయ్యాడు. ఇక్కడే, అతనికి ఊహించని పరిణామం ఎదురైంది. ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు వచ్చినప్పటికీ, ఎత్తు తక్కువగా ఉందన్న కారణంతో వైద్య కళాశాలలో ప్రవేశానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఎంసీఐ) నిరాకరించింది. అయితే భావ్‌నగర్ కలెక్టర్, స్కూల్ టీచర్లు, విద్యామంత్రి సలహా మేరకు కౌన్సిల్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గణేశ్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే అక్కడ చుక్కెదురైంది. అయినా ఏమాత్రం నిరాశ చెందకుండా సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. గణేశ్ పక్షాన కోర్టు నిలిచింది. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ప్రకారం.. గణేశ్‌కు వైద్య కళాశాలలో ప్రవేశం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఒక